క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చేయూత



బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న దృశ్యం

దెందులూరు: గోపన్నపాలెంలో పక్షవాతంతో బాధపడుతున్న ఎర్రమిల్లి పద్మరాజు కుటుంబానికి ఆదివారం చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ నగదు, నిత్యావసర వస్తువులు అందజేసింది. కార్యక్రమంలో ఎం.లక్ష్మీనారాయణ, పి నాగార్జునరావు, ఎం హేమ సుందర్, వై రామకృష్ణ, జి దుర్గాప్రసాద్, హేయ్ ప్రసాద్, ఈ శరత్ బాబు, సాయి, శ్రీను, భూషణం, మధు, మహేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక పఠనం



గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

దెందులూరు: పోతునూరు గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా గ్రంథాలయ అధికారి రాంబాబు విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌లలో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ఆటల పోటీల్లో విజేతలకు శిక్షణ తరగతులు ముగిసిన వెంటనే ధ్రువీకరణ పత్రాలు, బహుమతులు అందజేస్తామని వివరించారు.

మాధవి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి

ఏలూరు (టూటౌన్): మాధవి ఆత్మహత్యకు కారకులైన గెద్దం సంతోష్ తల్లిదండ్రులు,మేనమామను కఠినంగా శిక్షించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళాసంఘం (ఐద్వా) ఏలూరు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు పి.హైమవతి, ఏ.శ్యామలరాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్ఆర్‌ఐ కాలేజీలో డిగ్రీ సెకండియర్ చదువుతున్న పంపాల మాధవిని గెద్దం సంతోష్ ప్రేమించానని పెళ్లి చేసుకుంటానని చెప్పి నిరాకరించడంతో మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకుని మరణించిందని పేర్కొన్నారు. ఈ ఆత్మహత్యకు కారకులైన గెద్దం సంతోష్ తల్లిదండ్రులు, మేనమామలను కఠినంగా శిక్షించాలని ఐద్వా డిమాండ్ చేస్తుందని వివరించారు. వీరి వెనక ఎంతటివారున్నా కఠినంగా శిక్షించాలని మాధవి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరారు.

శ్రీవారి క్షేత్రంలో పటిష్టంగా బందోబస్తు

ద్వారకాతిరుమల: శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని క్షేత్రంలో ఆదివారం పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో భీమడోలు సీఐ యూజే విల్సన్, స్థానిక ఎస్సై టి.సుధీర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా వాహన తనిఖీలు జరిపారు. అలాగే ఆలయ పరిసర ప్రాంతాలను డ్రోన్ల ద్వారా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్సై సుధీర్ మాట్లాడుతూ దేవస్థానం వారు ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా భక్తులు వెళ్లేలా చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

బాలామృతం ప్యాకెట్లపై విచారణ

కొయ్యలగూడెం: బయ్యనగూడెం ఐసీడీఎస్ సెక్టార్ దిప్పకాయలపాడులోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించి బాలామృతం ప్యాకెట్లపై విచారణ చేయాల్సిందిగా ఆదేశించినట్లు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ ఆదివారం పేర్కొన్నారు. 9వ తేదీ గ్రామంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించిన బాలామృతం ప్యాకెట్లు నిబంధనలకు విరుద్ధంగా వేరొక చోట స్టోరేజ్ చేసి ఉంచడం వివాదాస్పదం అయిందన్నారు. అయితే నిల్వ చేసి ఉంచిన బాలామృతం ప్యాకెట్లు నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయా లేదా అన్నది గ్రామ కార్యదర్శి పూర్తి విచారణ చేసి నివేదికను ఇవ్వాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ద్వారకాతిరుమల: కార్మికుల లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సీఐటీయూ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్ట భాస్కరరావు అధ్యక్షతన ఆదివారం కార్మిక, కర్షక సమావేశం జరిగింది. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని పెంచాలని, రూ. 600 వేతనం ఇవ్వా లని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

తల్లిని మించిన దైవం లేదు



భీమడోలు: రిటైర్డ్ మహిళా టీచర్ గుల్ల నూకరాజును సత్కరిస్తున్న దృశ్యం



దెందులూరు: కోర్ ఆఫీసర్ స్వరూపరాణిని సత్కరిస్తున్న గృహసమితి సభ్యులు

భీమడోలు: అమ్మ దైవంతో సమానమని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో చిన్నారులు గ్రంథాలయానికి వచ్చి సామూహిక పుస్తక పఠనం చేశారు. నీతి కథలు చదివారు. గణితం , జీకే అంశాలపై మెలకువలను తెలుసుకున్నారు. అనంతరం మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత వాది, జిల్లా ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, మానవత మండల చైర్మన్‌గా వివిధ పదవులను సమర్థవంతంగా నిర్వహిస్తున్న రిటైర్డ్ మహిళా టీచర్ గుల్ల నూకరాజును ఘనంగా సత్కరించారు. మండే సుధాకర్ మాట్లాడుతూ అమ్మ ప్రేమ అనంతం, మాట అమృతం, జాలి అపారమని పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో అమ్మ రూపంలో దేవుడు ఉంటాడని పేర్కొన్నారు. సన్మాన గ్రహీత గుల్ల నూకరాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల పట్ల గౌరవంతో మెలగాలన్నారు. గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో చిన్నారులకు వివిధ శిక్షణాంశాలను నేర్పారు. యోగాసనాలు వేయించి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో సామూహిక పుస్తక పఠనం చేశారు. విద్యార్థులు చదరంగం, కబడ్డీ, కేరమ్స్ తదితర ఆటలు ఆడారు.

ఘనంగా మాతృ దినోత్సవం

దెందులూరులో...

దెందులూరు: తల్లిని మించిన దైవం లేదని దెందులూరు సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్ మేజర్ స్వరూపరాణి అన్నారు. ఆదివారం దెందులూరు సాల్వేషన్ ఆర్మీ మిలీనియం చర్చిలో మాతృదినోత్సవం ఘనంగా నిర్వహించారు. గృహసమితి సభ్యులు చిన్నారులు కోర్‌ఆఫీసర్‌ను శాలువా గులాబీ పువ్వులతో ఘనంగా సత్కరించారు. అనంతరం కుమారులు కుమార్తెలు వారి తల్లులను సత్కరించి పాదాభివందనం చేసి ఆశీర్వచనాలు పొందారు. కోర్ ఆఫీసర్ మాట్లాడుతూ సృష్టిలో కుటుంబం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అహర్నిశలు శ్రమించేది ఒక్క తల్లి మాత్రమే అన్నారు ప్రతి ఒక్కరూ తమ తల్లిని ఆప్యాయత అనురాగాలతో చూసుకోవాలన్నారు.

మినీ గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

దెందులూరు: మెట్ట గ్రామాల్లో మినీ గ్రంథాలయం ఏర్పాటు చేయాలని చదువరులు, నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. దెందులూరు గ్రామం దాటిన తర్వాత పెరుగ్గూడెం వరకు గ్రంథాలయం, మినీ గ్రంథాలయం లేకపోవడంతో నిరుద్యోగులు చదువరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పారావు పాలెం, శ్రీరామవరం, మేధినరావుపాలెం, ధర్మారావుపేట, రామారావుగూడెం, చల్ల చింతలపూడి, తిమ్మనగూడెం, సీతంపేట, కేఎస్‌పురం గ్రామాల్లో కనీసం మినీ గ్రంథాలయం కూడా లేదు. దీంతో ఆయా గ్రామాల్లో దినపత్రికలు, జీకే బుక్స్ ఎక్కడ చదువుకోవాలని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు స్పందించి మెట్ట గ్రామాల్లో కనీసం మినీ గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

పెదవేగి : వేగివాడలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై కె రామకృష్ణ తెలిపారు. నిందితుల నుంచి రూ.3,140 నగదు, 2 కోళ్లు, 6 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి

- సీఐ వెంకటేశ్వరరావు
- లేల్లగూడెంలో పోలీసుల పల్లె నిద్ర



ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలను తెలుసుకుంటున్న సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై రామకృష్ణ

పెదవేగి : పోలీసు శాఖ కేవలం ప్రజల రక్షణకే పరిమితం కాకుండా, ప్రతి ఒక్కరితో మానవీయ సంబంధాలు కలిగి ఉండాలనే లక్ష్యంతో ఏలూరు జిల్లా పోలీసు యంత్రాంగం విశేష కృషి చేస్తుందని పెదవేగి సీఐ కె వెంకటేశ్వరరావు తెలిపారు. ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై రామకృష్ణ, సిబ్బందితో కలిసి శనివారం రాత్రి మండలంలోన లేల్లగూడెం గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలపై గ్రామస్తులతో చర్చించారు. నేరాల నివారణ పట్ల అవగాహన కలిగించారు. సైబర్ నేరాలపై టోల్ ఫ్రీ నెంబర్ 1930కు సమాచారం ఇవ్వాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ×డయల్ 112 సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఎటువంటి రహస్య సమాచారం ఉన్నా నేరుగా జిల్లా ఎస్పీ వాట్సాప్ నెంబర్ 95503 51100కు పంపించవచ్చని తెలియజేశారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.

ఇన్‌చార్జుల ఏలుబడితో మమ

- ఏడు గ్రామాల్లో వీఆర్వో పోస్టులు ఖాళీ
- సేవలు అందక గ్రామస్తుల అవస్థలు

దెందులూరు: నియోజకవర్గ కేంద్రమైన దెందులూరు మండలంలో కీలకమైన ఏడు గ్రామాల్లో వీఆర్‌ఓ పోస్టులు ఖాళీగా ఉండడంతో గ్రామస్తులు రెవెన్యూ సేవలు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైంది. ఈ శాఖలోనే ప్రధానమైన గ్రామాల్లో వీఆర్‌ఓ పోస్టులు నియామకం చేయకపోవడం గమనార్హం. గోపన్నపాలెం, పోతునూరు, కొవ్వలి, దెందులూరు, శ్రీరామవరం , జోగన్నపాలెం, చల్ల చింతలపూడి గ్రామాల్లో వీఆర్‌ఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అసౌకర్యానికి గురవకుండా తహసీల్దార్ తాత్కాలికంగా ఇతర గ్రామాల వీఆర్‌ఓలను ఇన్‌చార్జులుగా నియమించారు. అయితే ఇన్‌చార్జులుగా నియమించిన వీఆర్‌ఓలకు ఈ అదనపు బాధ్యత తలపోటుగా తయారైంది. ఒక వీఆర్‌ఓ ఒక గ్రామం తో పాటు కచ్చితంగా ఒక శివారు కూడా ఉంటుంది. ఇప్పుడు ఇచ్చిన ఇన్‌చార్జి బాధ్యతలతో మూడు పంచాయతీలు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏడు గ్రామాల్లో వీఆర్‌ఓలు ఇన్‌చార్జులు ఎవరు, ఎప్పుడు, ఎక్కడ ఉంటారో.. ఎప్పుడు వస్తారో ఆయా గ్రామాల ప్రజలకు తెలియని పరిస్థితి. దీంతో రెవెన్యూ సేవలు సకాలంలో అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకొని ఏడు గ్రామాల్లో రెగ్యులర్ వీఆర్‌ఓలను నియమించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పెంకుటిల్లుకు రూ.8 వేల కరెంట్ బిల్లు



దెందులూరు: కూటమి ప్రభుత్వం సామాన్యుడు గుండెలదిరేలా నెల కరెంటు బిల్లును రూ. 8 వేలు పంపింది. బిల్లు చూసిన వినియోగదారుడు ఒక్కసారిగా బిత్తరపోయాడు. ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామంలో సోమయ్య అనే విద్యుత్ వినియోగదారుడు ఇంటికి ఈ నెల రూ. 8 వేలు బిల్లు ఇచ్చారు. ఆ బిల్లు చూసి ఇంట్లో నివసిస్తున్న వినియోగదారుడి మనవడు కోడి చుక్కల నాగేషు ఏం చేయాలో తెలియక తలపట్టుకుని కూర్చున్నాడు. రెక్కాడితే గాని డొక్కాడని సామాన్య వినియోగదారుడికి నెలకు ఎనిమిది వేల రూపాయల కరెంట్ బిల్లు వస్తే ఎలా చెల్లిస్తారని గ్రామంలో ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ సిబ్బందిని అడిగితే బిల్ రీడింగ్‌లో వచ్చిందే మీకు ఇచ్చామని సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దెందులూరు మండలంలోని ఉండ్రాజవరంలో రెండు నెలల కిందట షెడ్డుకి రూ.8 వేల బిల్లు, అదే మాదిరిగా ఏలూరు రూరల్ మండలంలో జాలిపూడిలో కూడా ఇలాగే రావడం గమనార్హం. అధికారులు మీటర్ ను పరిశీలించి బిల్లు లోపాన్ని సరిచేయాలని డిమాండ్ చేశారు.

కమనీయం.. కల్యాణోత్సవం





గుండుగొలనులో సుందరంగా ముస్తాబైన శ్రీవేంకటేశ్వర స్వామి, ఎదుర్కోలు ఉత్సవంలో కాళీబాబు కుటుంబ సభ్యులు

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి కల్యాణ వేడుక శనివారం రాత్రి కమనీయంగా జరిగింది. దేవదాయ శాఖ ఆధీనంలోని ఆలయంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు వార్షిక కల్యాణోత్సవాలు జరుగుతున్నాయి. తొలుత గ్రామంలోని వినాయకుని గుడి వద్ద ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. మేళతాళాల నడుమ స్వామి వారిని ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. స్వర్గీయ మొగళ్ల బాబు, బంగారులక్ష్మీ, నాగేశ్వరావుల కుటుంబ సభ్యులు, మాజీ ఉపసర్పంచ్ మామిళ్లపల్లి కాళీబాబు కుటుంబ సభ్యులు సహకారంతో ఈ వేడుక జరిగింది. నారాయణవనం కల్యాణమండపం వద్ద స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారులు రామానుజం మంగపతి ఆచార్యులు, సుధీరాచార్యులు, మోహన్ ఆచార్యులు, సాయి ఆచార్యులు శాస్త్రోక్తంగా కల్యాణ తంతును నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వంశీ, గ్రామ పెద్దలు వగ్వాల మీనాకుమారి, అచ్యుతరామారావు, వగ్వాల భాస్కర్, మామిళ్లపల్లి కాళీబాబు, భక్తులు పాల్గొన్నారు.

నారసింహుని జయంతి



ఐఎస్ జగన్నాథపురంలో కొలువైన నారసింహునికి హారతులిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలో అర్చకులు, పండితులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, అష్టోత్తర కలశ స్నపనను నిర్వహించారు. అనంతరం గర్భాలయంలోని మూలవిరాట్‌కు విశేష పంచామృతాభిషేకాలను వేద మంత్రోచ్ఛరణల నడుమ జరిపారు. ఆ తరువాత ఆలయ యాగశాలలో సుదర్శన నారసింహ ధన్వంతరీ గరుడ ఆంజనేయ అనంత సుబ్రహ్మణ్య హోమాలను నిర్వహించారు. వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

40 ఏళ్ల తర్వాత వారంతా ఒకే చోటకు



భీమడోలులో కలిసిన 1985-87 ఇంటర్ బ్యాచ్ విద్యార్థులు

1985-87 ఇంటర్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

భీమడోలు: భీమడోలు శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలలోని 1985-87 ఇంటర్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన వేడుక ఆదివారం అపూర్వంగా జరిగింది. మాతృ దినోత్సవంను పురస్కరించుకుని 40 ఏళ్ల తర్వాత దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కుటుంబాలతో సహా ఒకే చోటకు చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మధుర స్మృతులను స్మరించుకున్నారు. ఆ బ్యాచ్‌కు చెందిన వారంతా కళాశాలకు వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. తోటి స్నేహితులతో సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులు భాస్కరరావు, సత్యనారాయణ, సత్యకుమారి, నిమ్మగడ్డ ప్రసాద్, కృష్ణారావు, అటెండర్ వెంకట్రావులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. నాలుగు దశాబ్దాల కితం భీమడోలులో కళాశాల స్థాపనకు అప్పటి ప్రిన్సిపాల్ బాపూజీ నాయుడు, అప్పటి ఎమ్మెల్యే కంఠమని శ్రీనివాసరావు విశేష కృషి చేయడంతో ఈ ప్రాంతమంతా విద్యాభివృద్ధి సాధించిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సమేతంగా తరలి వచ్చి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం సెల్ఫీలు దిగి తమ స్నేహాన్ని పదిలపర్చుకున్నారు.

సౌకర్యాలు నిల్.. పన్నులు ఫుల్

- ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో పెరిగిన పన్నులు
- నగర వాసులపై అదనంగా రూ.5 కోట్లు పెనుభారం



ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం

ఏలూరు (టూటౌన్): సౌకర్యాలు నిల్.. పన్నులు ఫుల్ అన్న చందంగా ఏలూరు నగర పాలక సంస్థ పని తీరు ఉందని నగర వాసులు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రతీ ఏటా ఆస్తి పన్నులో 15 శాతం పన్ను పెంపుదల చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓ సాకుతో పన్నులైతే పెంచేస్తున్నారు..కానీ ఆ స్థాయిలో ప్రజలకు సౌకర్యాలు కల్పించడం లేదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం 2024-25లో ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను వసూలు లక్ష్యం రూ.32.31 కోట్లుగానూ, వాటర్‌టాక్స్ లక్ష్యం రూ.14.48 కోట్లుగానూ ఉంది. వాటర్ టాక్స్‌పై పెంపుదల లేకపోయినా ఆస్తి పన్నుపై 15 శాతం పెంపుదల చేయడంతో నగర వాసులపై సుమారు రూ.5 కోట్లు అదనపు భారం పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 పడనుంది. ట్యాక్స్‌లను ఇబ్బడి ముబ్బడిగాపెంచుకుంటూ పోతున్న నగరపాలక సంస్థ ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో మాత్రం ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పన్నుల పెంపు ఇలా

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో మొత్తం జనాభా 3.70 లక్షల మంది వరకు ఉన్నారు. మొత్తం 50 డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 79 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రస్తుతం వార్డు సచివాలయ సిబ్బందినే పన్నుల వసూళ్లలో ఎక్కువగా వినియోగిస్తున్నారు. వీరిపైన రెవిన్యూ విభాగం అధికారులు, సిబ్బంది అజమాయిషీ చూస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సంలో పెరిగిన అదనపు పన్నులను కలిపి వసూలు చేయాల్సి ఉంది. దీంతో వార్డు సచివాలయ సిబ్బందిపై మరింత పెను భారం పడనుందని భావిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26లో ఆస్తి పన్నుపై 15 శాతం అదనంగా పెంపుదల చేయనున్నారు. దీంతో గత ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను లక్ష్యమైన రూ.32.31 కోట్లకు అదనంగా సుమారు 5 కోట్లు మేరకు అదనపు పన్ను భారం పడనుంది. దీంతో పాటు వాటర్ ట్యాక్స్‌ను పెంపుదల చేయకపోవడం వల్ల బ్రతికి పోయామని దాన్ని కూడా పెంపుదల చేసి ఉంటే తమ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని నగర వాసులు చెబుతున్నారు.

సౌకర్యాల మాటేమిటి..?

పన్నులైతే ఇబ్బడి ముబ్బడిగా పెంచుకుంటూ పోతున్నారు. మరి మౌలిక వసతులు, సౌకర్యాల మాటేమిటని నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నగరంలో 80 వరకు మురికి వాడలు ఉన్నాయి. వీటిలో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పక్కా డ్రెయిన్లు ఉన్నా వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. నగరంలో ప్రధాన రహదారులు కాకుండా 50 డివిజన్‌ల పరిధిలో సుమారు 600 వరకు రహదారులు ఉన్నాయి. వాటి నిర్వహణ అంతంత మాత్రంగానే ఉందనే విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొత్తలో హడావుడిగా రోడ్లను ప్యాచ్ వర్కులు చేసి చేతులు దులిపేసుకున్నారనే వాదనలు ఉన్నాయి. రోడ్లు, డ్రెయిన్లు, వీధి లైట్లు, తాగు నీటి సరఫరా వంటి వాటికి కార్పొరేషన్ నిధులను ఖర్చు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

పన్నుల భారం పెంచడం సరికాదు



ఏలూరు నగరపాలక సంస్థపరిధిలోని ప్రజలపై ఏటా ఆస్తిపన్నులపై అదనపు బారాలు మోపడం సరికాదు. నగరపాలకక సంస్థ ఆదాయాన్ని అయితే పెంచుకుంటుంది కానీ ఆ స్థాయిలో ప్రజలకు కనీస వసతులు, సౌకర్యాలు కల్పించడం లేదు. అదనపు పన్నులు పేద, మధ్య తరగతిప్రజల ఆర్థిక పరిస్థితులపై ప్రభావాన్ని చూపుతున్నాయి.

– బి.సోమయ్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు, ఏలూరు

కనీస సౌకర్యాలు కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి

నగర వాసులకు కనీస సౌకర్యాలైన డ్రెయినేజీలు, తాగునీరు, విద్య, వైద్యం, రోడ్ల నిర్మాణం, పార్కుల నిర్వహణ వంటి వాటి పట్ల అధికారులు దృష్టి సారించాలి. పన్నుల భారం పెంచిన విధంగానే మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అప్పుడే నగర వాసుల్లో పన్నులు భారం పెద్దగా కనిపించదు. ఎలాంటి వసతులు, సౌకర్యాలు కల్పించకుండా పన్నులు పెంచడం సరికాదు.

– జి.గోపీ, సీఐటీయూ నాయకుడు, ఏలూరు

జాలిపూడిలో మేరీ మాత పండుగ

దెందులూరు: దేవునిపై విశ్వాసం మానవుని జీవన విధానాన్ని మెరుగుపరుస్తుందని ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు అన్నారు. జాలిపూడి గ్రామంలో విచారణకర్త ఫాదర్ తోట అంతోని రాజు ఆధ్వర్యంలో ఆదివారం మేరీ మాత పండుగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత మేరీ మాత ప్రతిమను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జాలిపూడి ఆర్‌సీఎం చర్చిలో పీఠాధిపతి జయరావు ప్రత్యేక దివ్య పూజ బలి అర్పించారు. వేడుకల్లో ఛాన్సలర్ బాబు, జార్జ్ సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజ్ కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్, దెందులూరు విచారణకర్త ఫాదర్ అమ్మన్ రాజా, పెదపాడు విచారణకర్త ఫాదర్ ఫాదర్ పి.మిల్క్ ఇయర్, ఫాదర్ ఫ్రాన్సిస్ అసిస్సి పాల్గొన్నారు.